# అమ్మ



గేటు శబ్దమైతే తలెత్తి చూశాడు చంద్రం.

అతని తల్లి గేటు తీసుకుని వస్తూండటం కనిపించింది. మళ్లీ ఏం అవసరం వచ్చిందోనని మనసులోనే చిరాకుపడ్డాడు.

తన తల్లి ప్రతినెలా కనీసం ఓ రెండుసార్లన్నా తనింటికి రావడం, తన తమ్ముళ్ళ పిల్లలను స్కూల్లో చేర్పించాలనో, ఫీజులు కట్టాలనో, ఆరోగ్యం బాగాలేదనో తన నుంచి డబ్బు తీసుకెళ్లడం ఆనవాయితీగా మారిపోయింది. వాళ్ళకు స్థిరమైన ఉద్యోగం లేకపోవచ్చు కానీ, తానేం కలెక్టరు గిరీ వెలగబెట్టడం లేదు కదా!

తన పిల్లలూ పెద్దవాళ్ళవుతున్నారు. కాలేజీలో చేర్పించాలంటే ఎంత ఖర్చవుతుంది? అసలు ఎప్పుడూ వాళ్ళ గురించే కాని, తన గురించి ఒకసారి కూడా ఆలోచించదే? ఏమైనా అంటే– "అది కాదురా చంద్రం! మీ నాన్న పోయిన తర్వాత నీవే వాళ్ళకు తండ్రిలాంటి వాడివి. నువ్వు ఆదుకోకపోతే వాళ్ళనింకెవరు ఆదుకుంటారు చెప్పు?" ఇలా ఉంటాయి ఆమె మాటలు. ఎంతయినా ఓ మోస్తరు రచయిత్రాయె! పత్రికల్లో అప్పుడప్పుడూ కథలూ, కాకరకాయలూ రాస్తూంటుంది. మాటలతోనే బోల్తా కొట్టించేస్తుంది. ఈసారి మాత్రం తను జాగ్రత్తగా ఉండాలి.

ఇంటి లోపలికి వచ్చిన సుజాత చంద్రాన్ని చూసి, "బాగున్నావా నాయనా? సునంద ఏదీ?" అని అడిగింది.

"ప్రక్కింటి వాళ్ళు పిలిస్తే సినిమా కెళ్లిందమ్మా! పిల్లలు యింకా ట్యూషన్ నుంచి రాలేదు. కూర్చో... మంచినీళ్లు త్రాగుతావా?"

"వద్దురా చంద్రం! నీతో ఓ విషయం మాట్లాడాలి."

"చెప్పమ్మా!"

"నేను నిన్ను తరచుగా యిబ్బంది పెట్టడం నాకూ బాధగానే వుందిరా! కానీ, తప్పటం లేదు. మీ నాన్న ప్రభుత్వోద్యోగి అయివుంటే కనీసం నాకు పెన్షన్ అయినా వస్తూండేది. దాంతో నీ తమ్ముళ్ళు అవసరాలు అంతో యింతో తీర్చేదానిని. కానీ, నాకా అదృష్టం లేకపోయింది. అయినా నాకు డబ్బు లేదన్న బాధ లేదురా! ఆ భగవంతుడు నాకు నీలాంటి సంస్కారవంతుడైన కొడుకుని యిచ్చాడు. మా యింటి నుంచి నీవు వేరుగా వచ్చేసినా మమ్మల్ని వేరుగా చూడలేదు నీవు. నీ కష్టాలు నీకున్నా మా కష్టాల్లో మమ్మల్నాదుకున్నావు. నిండు నూరేళ్లూ చల్లగా బ్రతకాలిరా నువ్వు!"

"అమ్మా! ఇప్పుడివన్నీ ఎందుకు చెప్పు?"

"నన్ను చెప్పనీరా! బిడ్డల గొప్పతనం వాళ్ళముందే చెప్పకూడదంటారు. అందుకే యిన్నాళ్లూ నేనేం చెప్పలేదు. కానీ, యీరోజు నాకు ఎంతో సంతోషంగా ఉందిరా చంద్రం! ఉగాది కథల పోటీకి నేను రాసి పంపిన నవలకు మొదటి బహుమతి ముప్ఫైవేలు వచ్చింది. ఆ పైకం నా కానుకగా నీకిస్తున్నాను... తీసుకో. ఎప్పుడూ తీసుకోవడమే కాని, యివ్వడం తెలియని ఈ నీ అమ్మ మనస్ఫూర్తిగా యిస్తున్న కానుక యిది! నీ పిల్లలూ పెద్దవాళ్ళవుతున్నారు. కాలేజీ చదువులంటే ఎంత ఖర్చవుతుందో నాకు తెలుసు. తీసుకో!"

తల్లి తన చేతిలో పెట్టిన నోట్లకట్టల వంక చూడటం లేదు చంద్రం. అతని మనసు పశ్చాత్తాపంతో నిండిపోయింది. అందుకు సాక్ష్యంగా కళ్ళనిండా నీళ్లు! గేటు వరకూ వెళ్లిన తల్లిని ఆపి అన్నాడు–

"అమ్మా... నాకీ డబ్బు వద్దమ్మా! నాకు నువ్వే కావాలి. ఇప్పుడన్నావే... నేను నూరేళ్లూ చల్లగా ఉండాలని. ఆ దీవెన చాలమ్మా నాకు! ఎంత డబ్బైనా దానికి సాటి రాదు."

తల్లి చేతిలో నోట్లకట్టలను పెట్టి, "పదమ్మా... నిన్ను యింటివరకూ దిగబెడతాను" అంటూ ఇల్లు తాళం వేసి తల్లితో బయలుదేరాడు చంద్రం.

●

'ఆంధ్రభూమి' వారపత్రిక ... 5 ఏప్రిల్ 2001